# సింగిల్ పేజీ కథలు

## పరిష్కారం

"హర్ష కల్పనని పెళ్లి చేసుకోవట్లేదట కదా! పెళ్లి చేసుకోనని ఖచ్చితంగా చెప్పేశాడట కదా!" ఆశ్చర్యంగా అన్నాడు ప్రదీప్ రవిశంకర్‌తో.

"ఆ... అదేమిటి? హర్ష కల్పనని చేసుకోకపోవడమేమిటి? చాలా విచిత్రంగా వుందే. నువ్వు చెబుతున్నది నిజమేనా? నమ్మలేకుండా వున్నాను" అన్నాడు రవిశంకర్ ఆశ్చర్యంగా.

"అదే నేనూ నమ్మలేకుండా వున్నాను. ఇంతకాలం ఒకరినొకరు ప్రేమించుకొని, మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా పేరుతెచ్చుకుని యువతరమంతా ఈర్ష్య పడేలా ప్రవర్తించి ఇప్పుడిలా విడిపోవడమేమిటి? నిజంగా ఇది చాలా దారుణం" ఖచ్చితంగా అన్నాడు ప్రవీణ్.

ఇంతలో కిరణ్ వడివడిగా అడుగులు వేసుకుంటూ అక్కడికి వచ్చాడు. "ఏమిటి కిరణ్ ఏదైనా న్యూసా?" అడిగాడు ప్రవీణ్.

"హర్ష కల్పనని పెళ్లి చేసుకోనని చెప్పాడట. స్టూడెంట్స్ అందరూ ఇదే విషయాన్ని ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు" అన్నాడు కిరణ్.

ఒక్కసారిగా క్యాంపస్ అంతా కలియజూశాడు ప్రదీప్. ఎక్కడ చూసినా స్టూడెంట్స్ గుంపులు గుంపులుగా నిలబడి హర్ష, కల్పనల గురించి చెప్పుకుంటున్నారు, క్లాసులకి కూడా వెళ్లకుండా. అలా విడ్డూరంగా చెప్పుకోవడం చూస్తే ప్రదీప్‌కి కల్పనపై జాలి వేసింది. తనూ ఏమీ చేయలేక అలా అందరి వైపూ చూస్తూండిపోయాడు.

* * *

"పద్మజా! కల్పనని హర్ష పెళ్లిచేసుకోనని చెప్పాడట కదా! ఎందుకని? నీకేమైనా తెలుసా?" పొలిటికల్ సైన్సు లెక్చరర్ అడిగాడు పద్మజని.

"అదే సార్ నాకూ అర్థం కావడం లేదు. నాకు నిన్ననే తెలిసింది. కల్పన, హర్ష అంతగా ప్రేమించుకుని ఇప్పుడీ విధంగా అనడం నాకూ నచ్చలేదు. ఇంకా కల్పన కాలేజీకి రాలేదు. వస్తేగానీ ఏ విషయమూ తెలీదు" అంది పద్మజ.

"ఆ అమ్మాయి అంత త్వరగా కాలేజీకి ఎలా వస్తుంది? మనందరికీ ఈ న్యూస్ చాలా విచారంగా వుంది. కల్పనకి ఇంకెంత షాకింగ్‌గా వుందో! ఇప్పట్లో కాలేజీకి రాదేమో" అన్నారు పొలిటికల్ సైన్స్ లెక్చరర్ హరీష్.

"ఇప్పుడే నేను కల్పనకి ఫోన్ చేసి తెలుసుకుంటాను సార్. అసలేం జరిగిందో తెలుస్తుంది. ఏమీ లేకుండా ఇటువంటి వార్త బయటికి రాదు కదా" అంటూ కల్పనకి ఫోన్ చెయ్యడానికి వెళ్లింది పద్మజ.

పద్మజ ఫోన్ చేసి వచ్చి ఏమి చెబుతుందోనని పి.జి. స్టూడెంట్స్ అంతా ఎదురుచూడసాగారు. ఒక అరగంట తర్వాత ఫోన్ చేసిన పద్మజ రానే వచ్చింది.

"కల్పన మాట్లాడిందా? ఏమి చెప్పింది?" ఆతృతగా అడిగారు స్టూడెంట్స్ అందరూ.

"అసలు కల్పన ఇంట్లో లేదు. కాలేజీకే వెళ్లింది అని



వాళ్లింట్లో చెప్పారు" అంది పద్మజ.

ఏ విషయమూ తెలీక నిరుత్సాహపడిపోయారు స్టూడెంట్స్ అందరూ.

"కాలేజీకని బయలుదేరిన కల్పన ఇక్కడికి రాకుండా ఎక్కడికి వెళ్లిందో" మనసులో అనుకోబోయి పైకి అనేసింది పద్మజ.

ఇంతలో హర్ష ఎప్పటిలానే బైక్ వేసుకుని కాలేజీ క్యాంపస్ లోనికి వచ్చాడు. చాలామంది స్టూడెంట్స్ హర్ష చుట్టూ చేరారు.

"హర్షా! నువ్వు కల్పనని పెళ్లి చేసుకోవట్లేదట కదా! నిజమేనా?" ఆతృతగా అడిగాడు ప్రదీప్.

హర్ష ఏం చెబుతాడోనని స్టూడెంట్స్ అందరూ ఎదురుచూస్తున్నారు.

"అవును" నింపాదిగా సమాధానమిచ్చాడు హర్ష.

"అదేమిటి? నువ్వు, కల్పనా రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పైగా మీరిద్దరూ పెళ్లి చేసుకుంటారని అందరికీ తెలుసు కదా! ఇప్పుడిదేమిటి? కల్పనని చేసుకోనని ఎందుకు చెప్పావు?" అన్నాడు ప్రదీప్.

"ఇది నా స్వంత విషయం. దయచేసి ఇటువంటి విషయాలు నన్ను అడగొద్దు" అంటూ తప్పించుకున్నాడు హర్ష.

హర్ష వైఖరికి స్టూడెంట్స్ అంతా ఆశ్చర్యపోయారు. కల్పన కాలేజీకి వస్తుందేమోనని ఎదురుచూశారు. కానీ ఆరోజు రాలేదు.

* * *

పి.జి. చదువుతున్న హర్ష, కల్పన మెరిట్ స్టూడెంట్స్ కావడం వల్ల అందరి దృష్టీ వారిపైనే వుండేది. కాలగమనంలో ఆ ఇద్దరూ ఒకరంటే ఒకరికి ఆకర్షణ ఏర్పడింది. అది ప్రేమగా మారింది. వారి జంటను చూసి అందరూ సంతోషపడేవారు. త్వరలో వాళ్లిద్దరూ పెళ్లి చేసుకుంటారని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో హర్ష తాను కల్పనని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో కల్పన ఒక్కసారిగా షాక్ తిన్నది.

ఆరోజు కల్పన లైబ్రరీ నుండి బయటికి వచ్చి తన స్నేహితురాలు కోసం ఎదురుచూస్తోంది. ఇంతలో హర్ష కల్పన దగ్గరికి వచ్చాడు.

"కల్పనా! నేను నిన్ను పెళ్లి చేసుకోవట్లేదు" అన్నాడు.

"ఏమిటి హర్షా! ఏమిటి నువ్వంటున్నది?" మెదడు మొద్దుబారిపోతున్న భావనతో అంది కల్పన.

"అవును కల్పనా. నిన్ను పెళ్లి చేసుకోవడం కుదరదు" అన్నాడు హర్ష.

"ఎందుకని?" ప్రశ్నించింది కల్పన ధైర్యాన్ని కూడదీసుకుంటూ.

"కొన్ని అనుకోని పరిస్థితులు ఏర్పడ్డాయి. అందువల్ల ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది" దృఢంగా అన్నాడు